క్లుప్తంగా

మా 'బడి'లో మీ పిల్లలను చేర్పించండి



పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతున్న ఉపాధ్యాయులు

రాయవరం: మీ చిన్నారులను మా 'బడి'లో చేర్పించాలని కోరుతూ ఉపాధ్యాయులు ఇంటి బాట పట్టారు. మండలంలోని లొల్ల ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం అడ్మిషన్ల కోసం హెచ్ఎం కొవ్వూరి నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగారు. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభించనున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు హెచ్ఎం, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటుగా, ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న డిజిటల్ విద్య, ఇంగ్లిష్ మీడియంలో విద్య తదితర అంశాలను తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.చంద్రకళ, ఆర్.విజయశ్రీ, డి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి జన్మ నక్షత్ర పూజలు



అంగరలో శ్రవణా నక్షత్ర పూజలు చేస్తున్న అర్చకులు

కపిలేశ్వరపురం: అంగర గ్రామంలోని శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి జన్మ నక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు చేశారు. వైశాఖ మాసం బహుళ షష్ఠి తిథి నేపథ్యంలో నిర్వహించిన పూజల్లో అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ అర్చకుల బృందం స్వామివారిని విశేషంగా అలంకరించారు. పంచామృతాభిషేకం చేశారు.

ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాలి



అంగర సచివాలయంలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ కొండలరావు

కపిలేశ్వరపురం: సచివాలయాల్లోని ఉద్యోగులు ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా విధులు నిర్వహించాలని ఎంపీడీఓ కొండలరావు ఆదేశించారు. మండలంలోని అంగర సచివాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఉద్యోగుల హాజరు, ప్రభుత్వ శాఖల విధులు నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించి పలు సూచనలు చేశారు.

వడదెబ్బ తగలకుండా ఓఆర్ఎస్ వాడాలి



ఓఆర్ఎస్ ద్రావణం ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య కార్యకర్త

కపిలేశ్వరపురం: తీవ్రమైన ఎండవేడి నేపథ్యంలో వడదెబ్బ నివారణకు ప్రజలు తరచూ ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగాలంటూ వైద్య, ఆరోగ్య కార్యకర్తలు కపిలేశ్వరపురం గ్రామంలో అవగాహన కల్పించారు. ఉపాధి పని ప్రదేశాల్లో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉచితంగా అందజేశారు. రోజుకు సుమారుగా మూడు లీటర్ల సురక్షిత నీరును తాగాలని సూచించారు.

బ్యాంక్ కెనాల్‌కు క్లియరెన్స్ పనులు



తాతపూడిలోని మేజర్ కెనాల్‌లో గుర్రపు డెక్క తొలగిస్తున్న ఉపాధి కూలీలు

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడి గ్రామంలోని బ్యాంక్ కెనాల్‌లోని గుర్రపు డెక్క తొలగింపు పనులు చేపట్టారు. సుమారు 800 మీటర్ల పొడవునా కెనాల్‌లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించడం ద్వారా సాగు నీరు పారుదల ఆటంకం తొలగిపోతుంది. ఖరీఫ్ ఆరంభం కానున్న నేపథ్యంలో ఈ పనులను చేపట్టినట్టు ఉపాధిహామీ పథకం అధికారులు తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్ష నేరపూరితం

- పరీక్ష చేసినా, చేయించినా చట్ట పరిధిలో శిక్ష
- తల్లీ బిడ్డల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం కృషి
- కిల్కారీ సేవలతో మాతా శిశు సంరక్షణ
- రెండు నియోజకవర్గాల్లో మెరుగు పడిన వైద్యసేవలు



అంగర పీహెచ్‌సీలో గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ (ఫైల్)

కపిలేశ్వరపురం: మానవజాతి మనుగడ అమ్మ ఆలనా పాలనపై ఆధారపడి ఉంటుంది. నవమాసాలు బిడ్డను మోసి కనిపెంచే శ్రమపూరిత అమ్మతత్వం సృష్టికి మూలం. ఆ క్రమంలో అమ్మ కనేది ఆడ బిడ్డ అయినా... మగ బిడ్డ అయినా... ముద్దులొలికే బిడ్డే అవుతుంది. మరెందుకు ఏ బిడ్డ అనే ఆలోచన, ఆతృత.. పెరిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని దుర్వినియోగం చేస్తూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడాన్ని నిషేధిస్తూ చట్టం రూపొందింది. ఇందుకు భిన్నంగా పరీక్ష చేసిన వారిపైనా, చేయించిన వారిపైనా చర్యలు తీసుకుంటామంటూ సంబంధిత అధికారులు ఆదేశాలు చేశారు. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో స్కానింగ్ సెంటర్లు, ఆసుపత్రుల్లో తనిఖీలు సైతం చేస్తున్నారు. ప్రభుత్వం గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీపీఎన్‌డీటీ) చట్టం పటిష్ట అమలుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలందించడంతో పాటు కిల్కారీ సేవలు పేరుతో గర్భిణి, బాలింతలకు ఫోన్ ద్వారా యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ వారి సంరక్షణకు కృషి చేస్తున్నాయి.

పటిష్టమైన చట్టం బిడ్డకు శ్రీరామరక్ష

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం- 1994 ప్రకారం కడుపులోని బిడ్డకు శ్రీరామరక్ష. ప్రభుత్వం వద్ద లైసెన్స్ పొందిన స్కానింగ్ సెంటర్లు నిబంధనలను మీరితే చర్యలు తప్పవు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్టరీత్యా నేరం. అలా చేస్తే స్కానింగ్ సెంటర్ లైసెన్స్ రద్దు కావడంతో పాటు వైద్యులపై కేసు నమోదు చేస్తారు. నేరం రుజువైతే మూడేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉందని చట్టం చెబుతుంది.

రెండు నియోజకవర్గాల్లో ..

గర్భంలోని పిండం ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు ప్రభుత్వం ఏరియా ఆసుపత్రి, సీహెచ్‌సీలలో స్కానింగ్ పరికరాలను సమకూర్చింది. రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి, కపిలేశ్వరపురం, మండపేట, ఆలమూరు, కొత్తపేట సీహెచ్‌సీలలో స్కానింగ్ పరికరాలున్నాయి. అవి కాకుండా రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో మూడు చొప్పున ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి.

అవగాహన్ కార్యక్రమాలు ఇలా...

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడంలో గల నష్టాలను వివరించడంతో పాటు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధ చట్టం- 1994 చట్టం అమలు పరిధిని వివరిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేస్తున్నట్టు తెలిస్తే 18004253365 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసే ఏర్పాటు చేశారు. ప్రజల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు.

డెకాయ్ ఆపరేషన్లు

భ్రూణ హత్యలు, లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 1994లో ప్రీ కన్సప్షన్ అండ్ ప్రీ నాటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (పీసీపీఎన్‌డీటీ) చట్టాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, భ్రూణ హత్యలు చేయడం నేరం. చట్టం అమలులో భాగంగా డెకాయి ఆపరేషన్ పేరుతో మూడు నెలలకు ఒకసారి స్కానింగ్ సెంటర్లను అధికారులు తనిఖీ చేస్తున్నారు.

తల్లీబిడ్డా రక్షణకు కిల్కారీ సేవలు

కిల్కారీ అనే హిందీ పదానికి చిన్నారి చిరునవ్వు అని అర్థం. వైద్యసేవలందించడంతో పాటు ఇంటి వద్ద ఉన్న గర్భిణి, బాలింతలకు ఫోన్ ద్వారా యోగ క్షేమాలను అడిగి తెలుసుకోవడం కిల్కారీ సేవ లక్ష్యం. గర్భందాల్చిన నాలుగో నెల నుంచి కిల్కారీ సేవలు ప్రారంభమవుతాయి. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆరోగ్య నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై వారిని అప్రమత్తం చేయడం కార్యక్రమ లక్ష్యం. గర్భిణులు బాలింతలకు నేరుగా మహిళా డాక్టర్ ఫోన్ చేసి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీసి ధైర్యం చెప్తారు. అందుకోసం గర్భిణి, బాలింతల వివరాలు ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు.

పంట కాలువ పూడిక తీయించండి

మండపేట: ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తం అవుతున్నందున సాగునీటి పారుదలకు వీలుగా పంట కాలువల్లో పూడిక తీత పనులు ప్రారంభించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ ఇరిగేషన్ శాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ రామచంద్రుడు కాలువ ద్వారా పట్టణంలోని వందలాది ఎకరాలు సాగవుతున్నాయన్నారు. పెద్ద కాలువ లాకుల వద్ద ప్రారంభమైన ఈ కాలువ సంఘం కాలనీ, బైపాస్ రోడ్డు, గాంధీనగర్, సైధిల్ పేట, ఏడిద రోడ్డు, రావులపేట మీదుగా గొల్లపుంత నుంచి గొడ్డు కాలువ వరకూ సుమారు ఆరు కిలో మీటర్ల మేర ప్రవహిస్తోందన్నారు. ప్రస్తుతం గుర్రపు డెక్క, పిచ్చి మొక్కలు, ఇతర వ్యర్థాలతో అస్తవ్యస్థంగా ఉన్న ఈ కాలువకు పూడిక తీయించాలని సత్యనారాయణ కోరారు.

152 మంది విద్యార్థుల గైర్హాజరు

మండపేట: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం నిర్వహించిన భౌతిక శాస్త్రం పరీక్షకు 152 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్టు మండల విద్యాశాఖాధికారి నాయుడు రామచంద్రరావు తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 387 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరు కావాల్సి ఉందన్నారు. అయితే 235 మంది విద్యార్థులు మాత్రమే పరీక్ష రాసినట్టు ఆయన చెప్పారు.

విద్యా కానుకలు సిద్ధం చేసుకోండి

- డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు
- మండల స్టాక్ పాయింట్ తనిఖీ



విద్యాకానుక కిట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ మధుసూదనరావు

మండపేట: జూన్‌లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యా కానుక - 5 మెటీరియల్‌ను సిద్ధం చేసుకోవాలని సమగ్ర శిక్షణ అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్, డిప్యూటీ కలెక్టర్ ఎ.మధుసూదనరావు ఆదేశించారు. మండపేటలోని శ్రీ గౌతమి మున్సిపల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన మండల స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధుసూదనరావు మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభించే రోజున ప్రతి విద్యార్థి చేతికి విద్యా కానుక అందించేలా అధికారులు చర్యలు తీసుకున్నార న్నారు. మండపేట మండలంలోని పాఠశాలలకు వరుస క్రమంలో స్టాక్‌ను సిద్ధం చేసిన ఎంఈఓలు నాయుడు రామచంద్రరావు, సీహెచ్‌వీ సోమిరెడ్డిలను ఆయన అభినందించారు. విద్యా కానుక-5 రిజిస్టర్లను ముందుగానే సిద్ధం చేసుకుని, రోజువారీ పంపిణీని విద్యాకానుక యాప్‌లో అప్‌లోడ్ చేసుకోవాలన్నారు.

ప్రధానోపాధ్యాయినికి సత్కారం

ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న శ్రీ గౌతమి మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని చల్లా శోభావళిని డిప్యూటీ కలెక్టర్ దుశ్శాలువా కప్పి, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, పి. రాంబాబు, ఆర్ కృష్ణ మాధురి, ఎస్ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యం

- ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి గజలక్ష్మి
- రాయవరంలో రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రతా దినోత్సవం



రాయవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య సిబ్బంది



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

రాయవరం: మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉన్నట్టు ప్రతి ఒక్కరూ భావించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి అధికారి గజలక్ష్మి అన్నారు. కిషోర బాలికలకు రుతుక్రమం ఆరోగ్యం, పరిశుభ్రతా దినోత్సవాన్ని రాయవరం -1 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గజలక్ష్మి మాట్లాడుతూ మహిళలు, యువతులు తమ ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రుతుక్రమం అనేది సహజసిద్ధమైన ప్రక్రియ అని, దానిపై అపోహలను వీడాలని సూచించారు. రుతుక్రమం సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటుగా, పరిసరాల పరిశుభ్రతపై కూడా దృష్టి సారించాలన్నారు. మహిళలు రుతుక్రమం సమయంలో శానిటరీ నాప్‌కిన్స్ వాడాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, దీనిపై మరింత అవగాహన పెంచాలన్నారు. బాల్య వివాహాలను అడ్డుకోవాల్సిన బాధ్యత కమిటీలపై ఉందన్నారు. రుతుక్రమం సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు, తీసుకోవాల్సిన ఆహారంపై కిషోర బాలికలకు అవగాహన కల్పించారు. రక్తహీనత బారిన పడకుండా పౌష్టికాహారం, ఐరన్ టాబ్లెట్స్‌ను తీసుకోవాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన అవసరం

కె.గంగవరం: రుతుక్రమం సమయంలో పరిశుభ్రతపై కిశోర బాలికలు అవగాహన అవసరమని రామచంద్రపురం ప్రాజెక్టు సీడీపీఓ వీవీ మహలక్ష్మి అన్నారు. కోటిపల్లి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యకరంగా ఉండాలన్నారు. రక్త హీనత లేకుండా చూసుకోవాలని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండాలన్నారు. అనంతరం ప్లకార్డులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కె.గంగవరం మండల సూపర్‌వైజర్లు పి.అనురాధ, ఎం.పార్వతి, పి.చంద్రకళ, కుందూరు పీహెచ్‌సీ ఏఎన్ఎం రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికల సమస్యలపై అవగాహన

రామచంద్రపురంరూరల్: స్థానిక అన్నాయిపేట గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రుతుక్రమం ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీడీపీవో వీవీ వరలక్ష్మి పాల్గొని కిశోర బాలికలకు రుతుక్రమంలో వచ్చే సమస్యలపై అవగాహన కల్పించారు. వ్యక్తగత పరిశుభ్రత పాటించాలన్నారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెలంపాలెం, ద్రాక్షారామ సెక్టార్ల సూపర్‌వైజర్లు, కె.కల్యాణి, సూర్యవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోరబాలికలు పాల్గొన్నారు.

ముగిసిన యేసయ్య రక్షణ మహాసభలు



సువార్త ముగింపు సభలో వివిధ ప్రాంతాల పాస్టర్లు

కె.గంగవరం: మండల పరిధిలోని అముజూరు గత మూడు రోజులుగా జరుగుతున్న యేసయ్య రక్షణ మహాసభలు బుధవారం రాత్రితో ముగిశాయి. గ్రామానికి చెందిన మన్నా చర్చి ఆధ్వర్యంలో సంఘ కాపరి ఎం.జాన్‌బాబు ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా అంతర్జాతీయ ప్రసంగీకులు పలు ప్రాంతాలకు చెందిన పాస్టర్లు క్రీస్తు సువార్తను ప్రకటించారు. గ్రామానికి చెందిన విశ్వాసులతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన విశ్వాసులు అధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొని క్రీస్తు సువార్తను విన్నారు. ఆలయం వద్దే మూడు రోజులు భోజనలు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన క్రైస్తవులతో పాటు యండగండి, పామర్రు, కె.గంగవరం, పాణింగపల్లి తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొని క్రీస్తు సువార్తను విన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



కూర్మాపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్



రామచంద్రపురం మార్కెట్ సెంటర్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై సురేష్‌బాబు

రాయవరం: జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యలో ప్రతి ఒక్కరూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు, నిబంధనలు కచ్చితంగా పాటించాలని, ఎవరైనా అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని కూర్మాపురం గ్రామంలో బుధవారం ఎస్సై జి.సురేష్‌తో కలసి పర్యటించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వెల్లడైన తరువాత ఎటువంటి ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించినా, బాణసంచా కాల్చినా చర్యలు తీసుకుంటామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున గుంపులుగా తిరగొద్దని సూచించారు. ఇప్పటికే గొడవలు, కేసుల్లో ఉన్న వ్యక్తులపై నిఘా పెట్టామన్నారు. అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నించే వారిపై కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం మండపేట-కాకినాడ ప్రధాన రహదారిపై మాచవరం వంతెన వద్ద వాహన తనిఖీలు చేపట్టారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: వచ్చేనెల 4వ తేదీ వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నిబంధనల ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని, ఓట్ల లెక్కింపును పురస్కరించుకొని, రామచంద్రపురం పట్టణ పరిధిలో ఎటువంటి కొట్లాటలు, గొడవలు జరగకుండా నిరోధించుటలో భాగంగా అందరికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రామచంద్రపురం ఎస్సై కె.సురేష్‌బాబు అన్నారు. పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లోని వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద వ్యాపారస్తులకు, ప్రజలకు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు సందర్భంగా సెక్షన్ 144 సీఆర్‌పీసీ, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున, నలుగురు అంత కంటే ఎక్కువ మంది గుమికూడడానికి వీలులేదన్నారు. ఈనెల ఒకటో తేదీన ఎగ్జిట్ పోల్స్ వెలువడిన తర్వాత కానీ ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత గానీ భావోద్వాగాలకు లోనై, ఇతరులను రెచ్చగొట్టడం గానీ, ఇతరుల మనోభావాలు దెబ్బ తినేటట్లు ప్రవర్తించడం గానీ చేసినట్లయితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెల్లడించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, పోలీసులకు సహకరించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయాలను ప్రోత్సహించాలి



తాము గీసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కాజులూరు: రోజు రోజుకీ ప్రజాదరణ కోల్పోతున్న గ్రంథాలయాలను ప్రభుత్వాలు, ప్రజలు ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైన ఉందని మండల వైఎస్సార్ సీపీ నేత, కాజులూరు ఉప సర్పంచ్ దండంగి చిన్నారావు అన్నారు. గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా కొన్ని రోజులుగా జరుగుతున్న చిత్రలేఖనంపై విద్యార్థులకు బుధవారం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారావు మాట్లాడుతూ మారుతున్న యాంత్రిక జీవనంలో పుస్తక పఠనానికి ప్రతి ఒక్కరూ దూరమవుతున్నారన్నారు. పుస్తక పఠనం ద్వారా సామాజిక అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. అనంతరం గ్రంథాలయాధికారి కె.ప్రసాద్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో పాటలు, ఆటలు, పుస్తక పఠనం, డ్రాయింగ్ తదితర అంశాలపై వారం వారం పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నాయకులతో కలిసి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్నామన్నారు. స్థానిక ఉపాధ్యాయులు బి.సుధాకర్, వైసాయి స్పోకెన్ ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్ గణతంలోని మెళకువలను విద్యార్థులకు బోధిస్తున్నారన్నారు.

ఆసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

రామచంద్రపురం: అపస్మారక స్థితిలో ఉన్న ఒక వ్యక్తి చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతి చెందినట్టు రామచంద్రపురం ఎస్సై కె.సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 50 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి ఈ నెల 21న మధ్యాహ్నం సుమారుగా ఒంటి గంట సమయంలో రామచంద్రపురం పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌కి వెళ్లే దారిలో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు, దారినపోయేవారు ఆ వ్యక్తిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చేరిపించగా వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి సిఫార్సు చేసి పంపించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో (లివర్ సమస్యతో) చికిత్స పొందుతూ ఈనెల 28న అతను మృతి చెందినట్టు ఆసుపత్రి వైద్యులు ధృవీకరించారని ఎస్సై సురేష్‌బాబు వెల్లడించారు. దీనిపై రామచంద్రపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు. ఎవరికైనా ఈ వ్యక్తి గురించి తెలిస్తే రామచంద్రపురం ఎస్సై 94407 96589, రామచంద్రపురం పోలీస్ స్టేషన్ 08857 242333 నంబర్లకు ఫోన్ చేసి వివరాలను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

అన్నదాన ట్రస్టుకు రూ.11 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదానం ట్రస్టుకు విశాఖపట్నానికి చెందిన కాట్రేనిపాడు సత్యనారాయణ స్మారకార్థం అతని కుటుంబ సభ్యులు బుధవారం రూ.11,116 విరాళంగా అందించారు. సత్యనారాయణ భార్య కాట్రేనిపాడు వీరవేణి ఆమె కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని ఆలయ ఉద్యోగులకు అందజేశారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. దాత కుటుంబానికి ఆలయ ఉద్యోగులు, అర్చకులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

రామాలయం అభివృద్ధికి రూ 1.08 లక్షల విరాళం

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల తూర్పు వీధి రామాలయం అభివృద్ధికి ప్రముఖ పారిశ్రామికవేత్త, మురళీకృష్ణ సంస్థల అధినేత వంటిపల్లి పాపారావు రూ.1.08 లక్షలు విరాళంగా అందించారు. గ్రామంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ఆరామాలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి భక్తిభావాన్ని మరింత ఇనుమడింపజేయాలని ఆయన ఆలయ కమిటీకి విజ్ఞప్తి చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నెక్కంటి వెంకట్రాయుడు, అల్లూరి సత్యనారాయణ, నామాల రుద్రయ్యచౌదరి ఆధ్వర్యంలో గ్రామస్తులు దాత పాపారావును ఘనంగా సత్కరించి శ్రీహనుమత్ లక్ష్మణ సమేత శ్రీ సీతారామచంద్రమూర్తి ఫోటోను బహూకరించారు.

వ్యక్తి అదృశ్యం

పి.గన్నవరం: వ్యక్తి అదృశ్యంపై పి.గన్నవరం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట మండలం ఏనుగుల మహాల్‌కు చెందిన కుంచె రాజకుమార్(28) రావులపాలెం ఆర్టీసీ డిపోలో ప్రైవేటు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇతనికి పి.గన్నవరం మండలం పోతవరం గ్రామానికి చెందిన యువతితో గతంలో వివాహం జరుగగా ఆమె మరణించింది. దీంతో రెండేళ్ల క్రితం మరొక యువతితో రాజ్‌కుమార్‌కు వివాహం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఈనెల 27న మొదటి భార్య తల్లికి చెందిన మోటారు సైకిల్‌ను ఇవ్వడానికి పోతవరం వెళ్లాడు. అక్కడ మోటారుసైకిల్‌లు ఇచ్చి ఇంటికి తిరిగి చేరుకోలేదని ఎస్సై వివరించారు. ఈ మేరకు అతని తమ్ముడు కుంచె అనిల్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

నిత్యాన్నదానానికి రూ.56,396 విరాళం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్టుకు సఖినేటిపల్లికి చెందిన కొప్పర్తి రవికిరణ్, సాయిశ్రీజ దంపతులు రూ.56,396 విరాళం బుధవారం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించారు. ఈ మేరకు దాతకు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదం అందజేశారు.



అంతర్వేది ఆలయంలో స్వామివారి చిత్రపటం అందుకుంటున్న రవికిరణ్

విరిగిన కొమ్మ.. రోడ్డుకు అడ్డుగా



నల్లూరు-కాలేరు రహదారి మధ్యలో వేలాడుతున్న విరిగిన చెట్టుకొమ్మ

కపిలేశ్వరపురం: కాలేరు,-నల్లూరు ఆర్ అండ్ బీ రహదారిపై విరిగిన చెట్టుకొమ్మ రహదారి మధ్యలోకి వేలాడుతూ ప్రమాద భరితంగా ఉంది. ఇటీవల వీచిన ఈదురు గాలికి చెట్టు కొమ్మ కిందికు వాలింది. అధికారులు సంబంధించిన కొమ్మను తొలగింపు చర్య చేపట్టకపోవడంతో అటువైపు ప్రయాణం ప్రమాద భరితంగా ఉంది. రామచంద్రపురం, మండపేట పట్టణాలకు వెళ్లేవారు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు స్పందించి వేలాడుతున్న చెట్టుకొమ్మను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.